ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

జూబ్లీహిల్స్ : వాహనాల్లో తరలిస్తున్న వినాయక విగ్రహాల వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై అంజనమ్మ

హైదర్‌గూడలో మండపానికి చేరుకున్న గణనాథులు

బండ్లగూడ, సెప్టెంబర్ 6 : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ప్రజలందరూ గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం పత్తికుంటను ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వినాయక మండపాలను ఏర్పాటు చేసేవారు అన్ని జాగ్రత్తలను పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాన్ని వచ్చే భక్తులు సంయమనం పాటించి తమ పని చేసుకోవాలన్నారు. పత్తికుంట, పల్లె చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని అధికారులను అదేశించారు. అంతకు మందు ఎమ్మెల్యే గణేశ్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీధర్‌కు మట్టి వినాయకుడిని అందజేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ డీసీ రవికుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిబంధల ప్రకారం ఏర్పాటుచేసుకోవాలి

జూబ్లీహిల్స్ : వినాయక మండపాలను నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవాలని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఫిలింనగర్ పీఎస్ పరిధిలో ఏర్పాటు చేస్తున్న మండపాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అవగాహన కల్పించారు. విగ్రహాలు ప్రతిష్ఠించే ముందు నుంచి నిమజ్జనానికి తరలించే వరకు పూర్తి సమాచారం ఇవ్వాలని మండప నిర్వాహకులకు సూచించారు. మండపాల వద్ద రాత్రిపూట ఇద్దరు ముగ్గురు మనుషులు విధిగా ఉండాలని.. ఉత్సవ కమిటీ నిర్వాహకులు పూర్తిస్థాయి జాగ్రత్తలు పాటించాలన్నారు

ఓవర్ ఫ్లో సమస్యలు లేకుండా చర్యలు

వినాయక మండపాల వద్ద వాటర్ లీకేజీలు, సీవరేజీ ఓవర్ ఫ్లో సమస్యలు లేకుండా జలమండలి అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. జీఎం ఎస్.హరిశంకర్ ఆదేశాలతో గణేశ్ నవరాత్రులు పూర్తయ్యే వరకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటర్ లీకేజీలను గుర్తించి పరిష్కరించడంతో పాటు సీవరేజీ లైన్లలో పూడికతీత పనులు చేపడుతున్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిగూడ సెక్షన్ యూసుఫ్‌గూడలో మేనేజర్ శ్యామ్ మండపాల వద్ద చేపడుతున్న పనులను పరిశీలించారు.

జూబ్లీహిల్స్ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ తమ ఇండ్లలో మట్టి గణపతులను పూజించాలని.. కృత్రిమ రంగులతో చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని ఫిలింనగర్ కూడలిలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 6 : మట్టి గణపతులను పూజించడం మంచిదని.. పర్యావరణానికి హాని కలుగదని 18 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి సూచించారు. శుక్రవారం జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలోని ప్రజలకు ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణతో కలిసి మట్టి గణపతులను పంపిణీ చేశారు..

హిమాయత్ నగర్ : పర్యావరణహితంగా ఉండే మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి ఎన్.శ్రీకాంత్ అన్నారు. హెచ్ఎండీఏ సహకారంతో శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మట్టి వినాయక ప్రతిమలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళి, ఉపాధ్యాయులు అంజలి, మృణాళిని, ఏఐవైఎఫ్ నగర నాయకులు షేక్ మహమూద్, అనిల్‌కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు మట్టి వినాయకుడిని అందజేస్తున్న రాజేంద్రనగర్ గణేశ్ ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్

మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న డీసీ ప్రశాంతి

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు సిద్ధం

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 6 : అత్తాపూర్, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ల పరిధిలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించుకునేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇప్పటికే మండపాలకు గణనాథులను తీసుకువచ్చి డెకరేషన్ చేస్తున్నారు. ఉత్సవాల నేపథ్యంలో మండపాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. శాంతియుతంగా పండుగను జరుపుకోవాలని, అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా ఏర్పాటు చేస్తున్నమని పోలీసులు తెలుపుతున్నారు.

జోరుగా విగ్రహాల విక్రయాలు..

పలు ప్రాంతాల్లో స్టాల్స్ వద్ద గణేశ్ విగ్రహాల అమ్మకాలు జోరుగా సాగాయి. వివిధ ఆకారాల్లో గణనాథులను తయారు చేయడంతో మార్కెట్లు సందడిగా మారాయి. గతం కంటే రేట్లు భారీగా ఉన్నట్లు వినియోగదారులు వెల్లడించారు. తమ ఇండ్లు, కార్యాలయాలు, దుకాణాల్లో ఏర్పాటు చేసేందుకు భక్తులు గణనాథులను కోనుగోలు చేశారు.



ఫిలింనగర్‌లో మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్

విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలి

పర్యావరణ పరిరక్షణకై మట్టి వినాయకులను ప్రతిష్ఠించాలని నాయకుడు రామకృష్ణారెడ్డి సూచించారు. ప్రతి యేటా మణికొండలో వినాయక మట్టి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ బుద్దులు శ్రీరాములు, నాయకులు రాజిరెడ్డి, ఏర్పుల కుమార్, శ్రావణ్, గంగాధర్, ఆరిఫ్, స్పందన పాల్గొన్నారు.

- మణికొండ

విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, సెప్టెంబర్ 6 : ఆలయంలోని దుర్గామాత విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పోలీసు అధికారులను కోరారు. లక్ష్మిగూడ వాంబేకాలనీలోని పులిగుట్టలోని దుర్గమాత విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో శుక్రవారం ఆయన శంషాబాద్ డీసీపీ శ్రీనివాస్, మైలార్‌దేవ్‌పల్లి సీఐ నరేందర్, ఎస్సై నాయుడులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. శనివారం ఉదయం విగ్రహం పునఃప్రతిష్ఠాపన నిర్వహిస్తామన్నారు. డీసీపీ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అడికే జనార్దన్, మాలతి, ప్రసాద్, సి.హెచ్. లావణ్యరెడ్డి, హన్మంతురెడ్డి, అరుణ్‌కుమార్, సి.హెచ్.భాగ్యలక్ష్మి, నర్సింహ, ఆలయ కమిటీసభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

న్యాయం కావాలి

హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న రంగపవన్

హిమాయత్‌నగర్,సెప్టెంబర్ 6 : నాణ్యత లేని కారు అమ్మిన టాటా సంస్థపై ప్రభుత్వం చర్యలు తీసుకుని న్యాయం చేయాలని బాధితుడు రంగపవన్ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నాడు. శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో విలేకరులతో రంగపవన్ మాట్లాడుతూ.. 2023 నవంబర్ 16న నెక్సన్ ఈవీ (లాంగ్ రేంజ్) కారును కొనుగోలు చేయగా మరునాటి నుంచే సమస్యలు మొదలైయ్యాయని, 9 నెలలుగా మానసిక క్షోభ అనుభవిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ జిల్లా డీసీఐసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేయగా టాటా కంపెనీ, డీలర్‌కు కౌన్సెలింగ్‌కు రావాలని సమన్లు పంపించగా వాయిదాలు తీసుకుని అసత్యంతో కౌంటర్‌ను కంపెనీ పంపిందన్నారు. డీలర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య, ఉపాధ్యక్షుడు ఏడుకొండలు పాల్గొన్నారు.

విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ

మైలార్‌దేవ్‌పలి : కాటేదాన్ శాంతినగర్‌లోని శ్రీ విరాట్ విశ్వకర్మ ఆలయంలో యజ్ఞ మహోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పులిగిళ్ల శ్రీనివాసాచారి తెలిపారు. రంగారెడ్డి జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘం ఆధ్వర్యంలో మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ఆలయంలో మహోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 17న ఉదయం 7 గంటలకు యజ్ఞ మహోత్సవాలు జరుగుతాయన్నారు. మహోత్సవాలకు హాజరుకావాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు.

ఆటో బోల్తాపడి.. డ్రైవర్ మృతి

వెంగళరావునగర్, సెప్టెంబర్ 6 : ఆటోబోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడ, అంబేద్కర్‌నగర్‌కు చెందిన ఎం.చంద్రశేఖర్(57) ఆటోడ్రైవర్. స్కూల్ పిల్లలకు నడపడమే కాకుండా ఓలా బుకింగ్‌కు వెళ్తుంటాడు. గురువారం సాయంత్రం కొత్త సెల్‌ఫోన్ కొంటానని ఇంటి నుంచి వెళ్లాడు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. కిందపడ్డ చంద్రశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానాకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి కుమారుడు ఎం.అభిలాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈవ్‌టీజర్‌కు జైలుశిక్ష

వెంగళరావునగర్ : ఈవ్ టీజర్‌కు రెండురోజుల జైలుశిక్షను న్యాయస్థానం విధించింది. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ కథనం మేరకు.. కార్మికనగర్‌కు చెందిన పెయింటర్ ఎ.విజయ్‌కుమార్ బస్తీలో యువతులను వేధింపులకు గురి చేస్తున్నాడు. ప్రజల్ని ఇబ్బందులకు గురిచేస్తూ న్యూసెన్స్ కలిగిస్తున్నాడు. నిందితుడు విజయ్‌కుమార్‌పై పెట్టీ కేసు నమోదు చేసి మధురానగర్ పోలీసులు గురువారం నాంపల్లి 10వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మురళి ఎదుట హాజరుపర్చగా.. దోషికి 2 రోజుల జైలు శిక్ష విధించారు.

పోక్సో కేసులో 20 ఏండ్లజైలు

బండ్లగూడ, సెప్టెంబర్ 6 : పోక్సో కేసులో రాజేంద్రనగర్ కోర్టు నిందితుడికి 20 ఏండ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. మైలార్‌దేవ్‌పల్లి పీఎస్ పరిధిలో జరిగిన కేసు వివరాలను ఇన్‌స్పెక్టర్ నరేందర్ వెల్లడించారు. రాజుసాహు 28 ఏండ్ల యువకుడు స్క్రాప్ దుకాణంలో పని చేస్తుండేవాడు. అతడు 2019 స్థానికంగా నివాసం ఉండే మైనర్‌పై లైంగికదాడి చేశాడు. ఈ కేసులో నిందుతుడికి శుక్రవారం రాజేంద్రనగర్ లోని పోక్సో ప్రత్యేక కోర్టు 20 ఏండ్ల కఠిన జైలుశిక్ష, 8 వేల రూ పాయల జరిమానాను విధించింది. అ దేవిధంగా బాధితురాలికి 3 లక్షల రూ పాయలను పరిహారం ఇవ్వాలని తెలిపింది.

ఎమ్మెల్యే సూచనతో అధికారి పర్యటన

ఎర్రగడ్డ, సెప్టెంబర్ 6: వర్షాభావంతో ఎర్రగడ్డ డివిజన్‌లోని పేదల ఇండ్లకు సంబంధించి ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ బాలానగర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. దాంతో ఆర్ఐ నాగమణి సిబ్బందితో కలిసి శుక్రవారం డివిజన్‌లో పర్యటించారు. ఓల్డ్ సుల్తాన్‌నగర్‌లో అశోక్ ఇల్లు పూర్తిగా కూలిపోయిన విషయాన్ని తెలుసుకుని అక్కడికి వెళ్లారు.

నిరుపేద అయిన అశోక్‌కు వీలైనంత త్వరగా న్యాయం చేయాలని సూచిస్తూ బాలానగర్ ఎమ్మార్వోకు ఎమ్మెల్యే మాగంటి రాసిన లేఖను డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు డి.సంజీవ ఆర్ఐకి అందజేశారు. ఇంటి వివరాలను ఆర్ఐ సేకరించారు. రోడ్డుపాలైన అశోక్ కుటుంబానికి సత్వర న్యాయం చేయాలని సంజీవ అధికారిని కోరారు. సంజీవతో పాటు పార్టీ నాయకులు దాసి శ్రీకాంత్, తరుణ్ అధికారి వెంట ఉన్నారు.

ఇంటి పత్రాలను పరిశీలిస్తున్న ఆర్ఐ

భార్యాబిడ్డలు దూరమవడంతో..

ప్రసాద్ (ఫైల్)

వెంగళరావునగర్, సెప్టెంబర్ 6 : భార్యాబిడ్డలు దూరమవడంతో బతుకు భారమైంది. ప్రేమించి పెళ్లాడిన భార్యే కన్న బిడ్డల్ని వెంటబెట్టుకుని వదిలి వెళ్లిపోయింది. దీంతో దిగాలు చెంది కుంగిపోయి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మధురానగర్ పీఎస్ పరిధిలోని వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌లో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్ శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉండే అల్లు ప్రసాద్‌కు ఆరేళ్ల క్రితం మోతీనగర్‌కు చెందిన షాలినీతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రేమికులిద్దరూ వివాహబంధంతో ఒక్కటయ్యారు. ఈ దంపతులకు ఐదేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. మోతీనగర్‌లోని జిరాక్స్ షాప్‌లో ప్రసాద్ పనిచేసేవాడు. భర్తతో వచ్చిన మనస్పర్థలతో కొద్దిరోజుల క్రితం ఆ ఇల్లాలు తన ఇద్దరు పిల్లలను తీసుకుని మోతీనగర్‌లోని పుట్టింటికెళ్లి పోయింది. అయితే.. భార్యాబిడ్డల్ని ఇంటికి తెచ్చుకోవాలని ప్రయత్నించాడు. పిల్లలు గుర్తొచ్చి వారిని చూసుకోవాలనే తపనతో వీడియో కాల్స్ చేస్తే ఫోన్‌కట్ చేసి బ్లాక్ చేసింది. భార్య దూరమై బిడ్డల్ని కళ్లారా చూసుకోలేని ఈ జీవితం ఎందుకని మనోవ్యథ చెందేవాడు. వాచ్‌మెన్‌గా పనిచేసే తల్లి వద్ద ఉండే ప్రసాద్ కొంతకాలంగా బాధల్ని చెప్పుకునేవాడు. తల్లి ఓదార్చినా ప్రసాద్ తన బాధను మర్చిపోలేక పోయాడు.

శుక్రవారం సాయంత్రం తన మిత్రుడు సంతోష్‌కు ఫోన్‌చేసి తాను ఈ లోకం వదిలి వెళ్లిపోతున్నానని.. ఆత్మహత్య .. చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. సంతోష్ వెంటనే ప్రసాద్ తల్లికి ఫోన్ చేయగా.. ఆమె వచ్చి చూసేసరికి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి బిగించుకుని ఆత్మహత్య చేసుకుని కనిపించాడు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకు తరలించారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఖైరతాబాద్ జోన్‌లో పాఠశాల క్రీడలకు సన్నాహాలు

డిప్యూటీ డీఈఓ శామ్యూల్‌రాజ్‌తో ఇంటర్ స్కూల్ గేమ్స్ ఖైరతాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరిగా నియమితులైన విశ్వేశ్వర రావును సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

జూబ్లీహిల్స్, సెప్టెంబర్ 6 : ప్రభుత్వ పాఠశాల క్రీడల్లో భాగంగా ఖైరతాబాద్ జోన్‌లో ఇంటర్ స్కూల్ గేమ్స్ నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖైరతాబాద్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఫిజికల్ ఎడ్యుకేషన్ (స్కూల్ అసిస్టెంట్) ఉపాధ్యాయుడు ఆర్.విశ్వేశ్వరరావును నామినేట్ చేస్తూ డిప్యూటీ డీఈఓ శామ్యూల్ రాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం మండలస్థాయి అంతర్ పాఠశాలల క్రీడల కార్యదర్శిగా ఎంపికైన విశ్వేశ్వర రావును జిల్లా ఉప విద్యాధికారి శామ్యూల్ రాజ్ సమక్షంలో ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు సన్మానించారు.

ఇంటర్ స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఖైరతాబాద్-1, ఖైరతాబాద్-2, షేక్‌పేట్ మండలాలలో కబడ్డీ, ఖో ఖో, వాలీబాల్‌లలో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ చేపట్టి పోటీలు నిర్వహించడంతో పాటు హైదరాబాద్ జిల్లా స్థాయికి క్రీడాకారులను ఎంపిక చేయనున్నారు. ఈ క్రీడా సంవత్సరంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ చేపట్టడంతో పాటు రెండు విద్యా (2024-25, 2025-26) సంవత్సరాల్లో ఇంటర్ స్కూల్ గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వేశ్వర రావు వ్యవహరించనున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

దోమల నివారణకు జాగ్రత్తలు వివరిస్తున్న బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు నాగరాజు

బండ్లగూడ, సెప్టెంబర్ 6 : ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రావులకోళ్ల నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా సాయిబాలాజీ నగర్‌లో పారిశుధ్య సిబ్బందితో కలిసి ఇంటింటా దోమలు నిల్వ ఉండకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలు వివరించారు.

చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయాలి

హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 6 : చేనేత సహకార సంఘాలు, మాస్టర్ వీవర్స్ వద్ద నిల్వఉన్న చేనేత ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి వరద బాధితులకు అందించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు టి.వెంకట్రాములు శుక్రవారం కోరారు. నేతన్నలు ఉత్పత్తి చేసిన బెడ్ షీట్స్, లుంగీలు, టవల్స్ నిల్వ ఉండటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నూలుపై సబ్సిడీ కొనసాగించాలని, నేతన్నలందరికీ పనికల్పించే విధంగా చేనేత భరోసా నిర్ణయించి అమలు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ప్రజాస్వామ్యయుతంగా సంఘాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్‌కు రూ.2 లక్షలు

హిమాయత్‌నగర్ : ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి రూ.2 లక్షల విరాళం అందజేస్తున్నట్లు వీబీజీ ఫౌండర్, ఎంఎంఎన్ గ్రూప్ చైర్మన్ మడిపడిగ రాజు శుక్రవారం తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడులను కలిసి సహాయనిధికి ఒక్కొక్క లక్ష చొప్పున ఇస్తామన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు, ఆయా సంస్థల సభ్యులు విరాళాలు ఇచ్చేందుకు ముందుకు రావాలని కోరారు.

కష్టమర్లుగా వచ్చి.. నగలతో ఉడాయించారు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 6 : కష్టమర్లుగా వచ్చి.. నకిలీ గొలుసును పెట్టి.. బంగారు నగతో ఉడాయించారు. పంజాగుట్ట పీఎస్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమాజిగూడలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో 47.86 తులాల బంగారు ఆభరణం కనిపించలేదు. సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించగా, గత నెల 21న సాయంత్రం 5 గంటలకు ఓ మహిళ వ్యక్తితో వచ్చి ఆభరణాలు కొనుగోలు చేసినట్లు నటించారు.

సేల్స్‌మెన్‌ను మాటల్లో పెట్టి తమ వెంట తెచ్చుకున్న 27 గ్రాముల నకిలీ ఆభరణాన్ని అక్కడ ఉంచి 47.86 తులాల బంగారు ఆభరణాన్ని ఎత్తుకెళ్లారు. బంగారు ఆభరణాల ఆడిట్‌లో ఈ విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో సీసీ కెమెరాలను పరిశీలించిన సిబ్బంది దొంగలను గుర్తించారు. స్టోర్ రూం హెడ్ అలీ రిసాయా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.